# కాపాడితే - కాపాడును !



రమేష్‌ను ఆసుపత్రిలో ఉంచారు.

తోటి విద్యార్థులు టీచర్లు వెళ్లి చూసి వస్తున్నారు.

నుదురు భాగం, మోచేయి వరకు చేతులు కాలినయి.

అయింట్‌మెంట్ పూసి కదలకుండా పడుకొమ్మన్నారు.

వచ్చిపోయే జనం పడుకోనిస్తారా ? రమేష్ మంచి పిల్లవాడు. మంచి మార్కులు తెచ్చుకుంటాడు. వినయంగా వుంటాడు. అందువల్లా టీచర్లు కూడ యిష్టపడతారు. క్లాస్ టీచర్ జయప్రకాష్ రాగానే మంచం మీది రమేష్ కదిలి, చూపులను నేలవైపు మరలుచుకున్నాడు.

"చో, చో, ఎంతపని చేసుకున్నావుర"

రమేష్ కనురెప్పలు కన్నీటిని వొదిలినయి.

"కొంచెమైతే కళ్ళు పోయేవి కదర" అన్నాడు టీచర్.

రమేష్‌లో దుఃఖం పెరిగింది.

"ఇంకానయం ఎక్కువ కాలలేదు. పరవాలేదు బాగౌవు తుందిలే" అన్నాడు

రమేష్ ముఖంలో వెలుగు అల కనిపించింది.

టీచర్ మంచంమీద కూర్చోని చేత్తో రమేష్‌ను తాకుతు "త్వరలోనే కోలుకుంటావు" మళ్ళీ అన్నాడు.

రమేష్ నవ్వుముఖంతో కదిలి టీచర్ ముఖంలోకి చూశాడు.

"నిప్పుతో చెలగాటం మంచిదికాదుర అంటే వినరు. నీవెకాదు నీ సోదరులంతా అంతే కదర" అన్నాడు.

"పండగ కదా సార్" అన్నాడు పక్కన నిలుచున్న రమేష్ ఫ్రెండ్ సారథి. సారథి రమేష్ కంటే ఓ క్లాస్ ఎక్కువ.

"అవుర, పండగైతే పైసలను కాల్చడమేనా ?"

"అందరు" అని నసిగాడు సారథి.

"నేనంటాను అందరు పిచ్చివాళ్లే! ఒకడు ఏదో చేస్తే అంతా దాన్నే అనుసరిస్తారు. వెర్రివాళ్లుర ఉత్త వెర్రివాళ్లు. ఈ పండగల పేరుమీద మందు సామాగ్రిని కాల్చడం, ఎందుకంటా ? ఎంత ఘోరం జరిగి పోయిందో చూస్తున్నారు కదా ?'.

కొంతసేపు ఎవ్వరు మాట్లాడలేదు. రమేష్‌ను చూడడానికి మరికొంతమంది అక్కడికొచ్చి -

"ఇది నిన్నీయాల్ల వచ్చిందా. వెనకట ఎప్పటినుండో వస్తూవుంది" అన్నాడు పక్కింటి వ్యక్తి, అతని వృత్తి వ్యాపారం.

"అన్ని పండగలు - పబ్బాలు వెనకటినుండే వస్తూ వున్నాయి. నేను కాదనను. కాలానుగుణంగా వచ్చే మార్పులను కూడ గమనించాలి. రోజు రోజుకు ఆలోచనలు పెరగడం లేదు ?" అంటు అందరివైపు చూశాడు.

అందరు మౌనంగా వింటువున్నారు.

"ఎప్పుడో ఓ రాక్షసుడు మునులను బాధ పెట్టాడని, వాన్ని భగవంతుని అవతారం చంపిందని, మనం ఈనాటికి దానిని పెద్ద

అర్భాటం చేసుకోవడం సరియైందేనా? అప్పోసప్పోచేసిన రూపాయలను కాల్చేసితే మిగిలేది ఏమిటి ? బూడిదెగ".

అందరు ఆలోచిస్తు నిలుచున్నారు.

"ఈ దయ్యాల పేర, దేవుళ్ళ పేర ధన-ధాన్యాలను బూడిద చెయ్యొద్దర. చూడడానికి ఒక్క మనిషి సొమ్మెకావచ్చు కాని అది సమిష్టిగ చూస్తే దేశ సంపద. ఏ దేశ సంపద వృధా కావద్దు. అది అలా వుంచండి, ఇప్పుడు రమేష్ పరిస్థితి ఏమిటి ఇంకాస్త కాలితే దృష్టిని కోల్పోయే వాడుకదా, ఇట్లా ఈ దేశంలో ఎంతోమంది ఇదే విధంగా చేస్తునేవున్నారు. వాళ్లు ఇల్లును బూడిద చేసుకుంటునే వున్నారు. అంతేకాదు ఎందరో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. నేను చెప్పొచ్చేది ఏమిటి అంటే పండగలపేర ఆపదను, అనర్థాలనుకొని తెచ్చుకోవద్దు.

ప్రతి రూపాయి చెమటోడ్చితేనే వస్తుంది. అందుకని రూపాయిని, మనం కాపాడితే అది మనల కాపాడుతుందని, గుర్తుంచుకోండి. చెప్పాలంటే యింకాచాల వుంది. ఇది సమయం కాదు. వస్త రమేష్. త్వరలోనే కోలుకుంటావులే", అంటు జయప్రకాష్‌లేచి వరండావైపు నడిచాడు. ఆయనవెంట మిగతా విద్యార్థులు నడుస్తు వున్నారు.

"సార్ మీరు దేవున్ని నమ్మర" అని అడిగాడు వెనక వస్తూవున్న సారధి.

జయప్రకాష్ నవ్వుతు వెనక్కు మళ్లి సారధివైపు చూశాడు. నడుస్తున్న సారధి ఓ క్షణం ఆగాడు.

"ఒరె సారధి దేవున్ని నమ్మడం నమ్మకపోవడం ఇక్కడ అప్రస్తుతం. నేను మాట్లాడేది పండగల పేరుమీద పెట్టి వృధా ఖర్చులగురించి, మూఢనమ్మకాలతో మనిషి చేస్తున్న ముదునష్టపు

పనుల గురించి, ఇంకొంచెం ఆలోచిస్తే పల్లెల్లో గ్రామ దేవతలకు అర్పించే జంతుబలుల గురించి, రాళ్లముందు వడ్డించే బోనాల గురించి, మనిషి తాగితే దేవునికి తాగుడు పొయ్యడం చేస్తుంటారు కదా, యివన్నీ అటవిక యుగంలో అడవిమనుషులు చేసినవి. ఈ ఆధునిక యుగంలో కూడనా ? వాటి పేరుతో ఎంత సంపద మట్టిపాలై పోతోందో ఆలోచించండి".

ఈ లోపల జయప్రకాష్ ఇల్లు వచ్చింది. వాకిట్లో ఆగారు.

"ఎవరైనా సరే కష్టించి సంపాదించుకున్నది అగ్గి పాలు చెయ్యొద్దు. పేదరికాన్ని పెంచుకోవద్దు. అసలే మనదేశ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. ఉన్న వనరులను అతి జాగ్రత్తగా వాడుకోవాలి. లేకపోతే పేదరికం ఇంకా పెరిగిపోతుంది సుమా ! ఇప్పుడు మీరున్నది కంప్యూటర్ యుగం. ముందు ముందు మీకే తెలుస్తుంది. మరోసారి మాట్లాడుకుందాం ఉంటా". అంటు ఇంట్లోకి నడిచాడు.

కథా నిలయం
శ్రీకాకుళం